



శ్రీకాకుళం కల్చరల్: కాలభైరవ పీఠంలో గాజులతో అలంకరించిన శ్రీచక్ర మండపం



టెక్కలి: లలితా త్రిపుర సుందరికి గాజులతో అలంకరణ

గౌరమ్మా.. కరుణించమ్మా

శ్రీకాకుళం కల్చరల్/ టెక్కలి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): గౌరీపౌర్ణమిని పురస్కరించుకుని.. శ్రీకాకుళంలోని బలగ నాగావళి నదీతీరాన ఉన్న శ్రీబాలత్రిపుర కాలభైరవ పీఠంలో అమ్మవారికి భక్తులు పూజలు చేశారు. గురువారం లక్ష గాజులతో శ్రీ చక్ర మండపాన్ని ఏర్పాటు చేశారు. నక్కవీధిలోని శ్రీ ఉమాజఠలేశ్వరస్వామి ఆలయంలో ఉమాదేవి అమ్మవారిని.. శాకంబరీదేవీగా అలంకరించారు. అలాగే టెక్కలిలోని లలితా త్రిపుర సుందరి ఆలయంలో అమ్మవారికి 11,016 గాజులతో అలంకరించి పూజలు చేశారు.



శ్రీకాకుళంలో శాకంబరీదేవిగా ఉమాదేవి



ఇసుక ర్యాంపు ప్రారంభిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్, ఎమ్మెల్యే రమణమూర్తి

ఉచిత ఇసుక విధానానికి
తూట్లు పొడిస్తే సహించం

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- గోపాలపెంట రీచ్ ప్రారంభం

నరసన్నపేట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉచిత ఇసుక విధానానికి తూట్లు పొడిస్తే.. సహించేంది లేదని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హెచ్చరించారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తితో కలిసి గోపాలపెంట ఇసుక ర్యాంపును ఆయన ప్రారంభించారు. 'జిల్లాలో నాలుగు ప్రాంతాల్లో ఇసుక రీచ్‌లను ప్రారంభించనున్నాం. ట్రాక్టర్ ఇసుకకు సీనరీజ్ పన్నులు, నది నుంచి డంపింగ్ యార్డుకు తీసుకువచ్చే ఖర్చులకు మాత్రమే రుసుం చెల్లించాలి. రవాణా చార్జీలు కూడా దూరం ప్రకారం నిర్ణయిస్తాం. ఇసుకతో వ్యాపారం చేయాలనే వారిపై చర్యలు తీసుకుంటామ'ని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో చేసిన తప్పిదాల వల్ల ఇన్నాళ్లు ఇసుక ఇవ్వలేకపోయామన్నారు. వర్షాకాలంలో పర్యావరణ అనుమతులు లేక ఇసుక రీచ్‌లో తవ్వకాలు చేయలేదని తెలిపారు. ఉచిత ఇసుక విధానంలో వ్యాపార ధోరణి చేస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఆర్డీవో సాయిప్రత్యూష, తహసీల్దార్ సత్యనారాయణ, మైనింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

పాత ధరకే విక్రయాలు

- కొన్ని బ్రాండ్లు మారాయి..
- ఇంకా తెరుచుకోని కొన్ని షాపులు




పలాస, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కూటమి సర్కార్.. ప్రభుత్వ మద్యం షాపులు రద్దు చేసి టెండరు విధానం ద్వారా దుకాణాలు కేటాయించింది. అయితే కొత్త ధరలు, రూ.99కే క్వార్టర్ మద్యం, కొత్తబ్రాండ్లు మాత్రం ఇంకా అమలులోకి రాలేదు. రెండు రోజులవుతున్నా టెండర్ల మేరకు కొత్త షాపులు ఇంకా తెరవకపోవడంతో మందుబాబులు వేరే రూట్లు వెతుక్కోవాల్సి వస్తోంది. పలాస-కాశీబుగ్గ జంటపట్టణాలకు మొత్తం ఏడు షాపులు కేటాయించారు. బుధవారం నుంచి ఈ షాపులు తెరుచుకోవాల్సి ఉంది. మద్యం నిల్వలు రాక పోవడంతో గురువారం సాదాసీదాగా ప్రారంభించారు. మరికొన్ని షాపులకు మద్యం లభించకపోవడంతో శుక్రవారం వాటిని తెరిచే ప్రయత్నం చేస్తున్నారు. ఇదిలా ఉండగా కొత్త షాపుల్లో పాత సరుకులే దర్శనం ఇవ్వడంతో మందు బాబులు విచారం వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు పాత ధరలే ప్రస్తుతం అమలవుతున్నాయని ఆవేదన చెందుతున్నారు. ఈ విషయమై ఎక్సైజ్ సీఐ కె. మల్లికార్జున రావు వద్ద ప్రస్తావించగా మద్యం సీసాలపై ఉన్న ధరకే అమ్ముతున్నారని, కొత్త ధరలు ఇంకా రాలేదన్నారు. రూ.99 క్వార్టర్ మద్యం సీసాలు ఇంకా వినియోగంలోకి రాలేదని తెలిపారు. జంట పట్టణాల్లో ఏడు షాపులకుగాను ఆరు ప్రారంభించారని, శుక్రవారం ఒకటి ప్రారంభిస్తారని వివరించారు.



- వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లి రహదారి ఇది. రాళ్లు తేలిన ఈ రహదారి పై రాకపోకలు సాగించాలంటేనే ప్రజలు హడలిపోతున్నారు. వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యమే ఈ దుస్థితికి కారణమని ఆవేదన వ్యక్తం చేశారు. కాశీబుగ్గ నుంచి వజ్రపుకొత్తూరు రహదారికి నాలుగేళ్ల కిందట (నేషనల్ డెవలప్ బ్యాంకు) సౌజన్యంతో పనులు ప్రారంభించా రు. కాగా బ్యాంకు మంజూరు చేసిన నిధులను సైతం వైసీపీ ప్రభు త్వం పక్కదారి పట్టించింది. కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించక పోవడంతో పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వమైనా స్పందించి ఈ రహదారి పనులు చేపట్టాలని ఈ ప్రాంతవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నిధులు.. దారి మళ్లించి!

- రోడ్డు పనులకు బిల్లులు చెల్లించని వైసీపీ ప్రభుత్వం
- అధ్వానంగా రహదారులు.. ప్రజలకు తప్పని కష్టాలు



వజ్రపుకొత్తూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో రహదారులు అధ్వానంగా మారాయి. ఎక్కడికక్కడ గోతులమయమై ప్రయాణికుల సహనానికి పరీక్ష పెడుతూనే ఉన్నాయి. కాంట్రాక్టర్లు పనులు చేపట్టినా.. బిల్లులు సక్రమంగా చెల్లించకపోవడంతో అవి మధ్యలోనే నిలిచిపోయాయి. 2020లో కాశీబుగ్గ నుంచి వజ్రపుకొత్తూరు వరకు సుమారు 16కిలోమీటర్లు పొడవున ఆర్అండ్‌బీ రోడ్డు విస్తరణ పనులకు చర్యలు చేపట్టారు. ఇందుకు సంబంధించి ఎన్‌డీబీ (నేషనల్ డెవలప్ బ్యాంకు) సౌజ న్యంతో రూ.20 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఎన్‌డీబీ 70 శాతం అంటే రూ.14కోట్లు మంజూరు చేయగా.. మిగిలిన 30 శాతాన్ని (రూ.6కోట్లు) వైసీపీ ప్రభుత్వం జమ చేయాల్సి ఉంది. విజయవాడకు చెందిన కాంట్రాక్టర్ టెండర్ దక్కించుకుని పనులు ప్రారంభించారు. సుమారు రూ.9కోట్ల మేర పనులు చేపట్టారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం తొలివిడతగా చెల్లించాల్సిన బిల్లులు రూ.8 కోట్లు కాంట్రాక్టర్‌కు ఇవ్వలేదు. ఏళ్ల తరబడి బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ పనులు మధ్యలో నిలిపేశారు. ఈ క్రమంలో వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లి, తదితర గ్రామాల్లో రహదారులు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. స్థానిక నాయకులు కాంట్రాక్టర్‌పై ఒత్తిడి చేయగా.. బిల్లులు చెల్లిస్తేనే పనులు చేపడతామని స్పష్టం చేశారు. నిధుల విషయమై అధికారులు ఆరా తీయగా.. బ్యాంకు విడుదల చేసిన నిధులు కూడా ఇతర పథకాల కోసం వైసీపీ ప్రభుత్వం మళ్లించినట్టు తెలిసింది. సాధారణంగా ప్రత్యేక పనులకు బ్యాంకు సహాయం అందించినప్పుడు.. ముందుగా ఆ నిధులను కాంట్రాక్టర్‌కు చెల్లించాలి. మిగిలిన మొత్తాన్ని చివరి వాయిదాలో రాష్ట్ర ప్రభుత్వం వాటా చెల్లించాలి. కానీ కాశీబుగ్గ- వజ్రపుకొత్తూరు రోడ్డు విషయంలో మాత్రం రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా 30శాతం నిధులు విడుదల చేయకపోగా.. బ్యాంకు అందించిన రూ.14కోట్లు నిధులు ఇతర పథకాలకు మళ్లించడం విమర్శలకు తావిస్తోంది. గత ప్రభుత్వ నిర్వాకంతో తమకు ఇబ్బందులు తప్పడం లేదని ఈ ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వమైనా నిధులు మంజూరు చేసి.. ఈ రహదారి పనులు పూర్తిచేయాలని కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..



రోడ్డు పనులు నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. మూడేళ్లుగా ఈ రోడ్డుపై అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డుపనులు పూర్తిచేయాలని అనేకసార్లు అధికారులను నాయకులను కోరినా ఫలితం లేదు. వైసీపీ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలతో అవస్థలు తప్పడం లేదు.

-వెంకటరమణ, మాజీ కోఆప్షన్ సభ్యుడు, నువ్వలరేవు

బిల్లులు విడుదల కాలేదు..

రోడ్డు పనులు కొంతమేర చేపట్టినా బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ అర్థాంతరంగా వదిలేశారు. ఉన్నతాధికారుల ద్వారా గత ప్రభుత్వానికి నివేదికలు పంపినా.. రూపాయి కూడా నిధులు విడుదల చేయలేదు.

-విక్రం, ఆర్అండ్‌బీ జేఈ



కవిటి : ఇద్దివానిపాలెంలోకి వచ్చిన సముద్రపు నీరు

ఎగసి పడుతున్న అలలు

- ఇద్దివానిపాలెంలోకి సముద్రపు నీరు

శ్రీకాకుళం/ కవిటి/ గార, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తుఫాన్‌గా మారడంతో జిల్లావ్యాప్తంగా గురువారం భారీ వర్షం కురిసింది. వజ్రపుకొత్తూరు మండలంలో అత్యధికంగా 60.75 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కవిటి మండలం ఇద్దివానిపాలెం గ్రామంలోకి సముద్రపునీరు చొరబడింది. ఇద్దివానిపాలేనికి ఆనుకుని బీలబట్టి వరద నీరు సముద్రంలో కలుస్తుంది. గతంలో ఈ గ్రామంలో ఇళ్లకు రక్షణగా సముద్రపు అంచులో గోడ నిర్మించారు. ఈ రక్షణ గోడ శిథిలావస్థకు చేరుకోవడంతో అలల ఉధృతి పెరిగినప్పుడు సముద్రపు నీరు గ్రామంలోకి వచ్చేస్తుందని స్థానికులు తెలిపారు. గురువారం రామాలయం వరకూ సముద్రపు నీరొచ్చిందని, అలల ఉధృతికి బోట్లు బోల్తా పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే గార మండలం బందరువానిపేట తీరంలో అలలు ఎగసిపడ్డాయి. శ్రీకాకుళంలో రహదారులు జలమయమయ్యాయి. సముద్రంలో చేపలవేటకు మత్స్యకారులు వెళ్లొద్దని అధికారులు హెచ్చరికలు జారీచేశారు. తుఫాన్ బాధితుల సహాయక చర్యల నిమిత్తం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు.

అధినేత వద్దకు
తమ్ముళ్ల చిట్టా!

- నేడు ఎమ్మెల్యేలతో చంద్రబాబు సమీక్ష
- కొంతమంది ఇసుకలో జోక్యం
- మరికొందరికి మద్యం దుకాణాల్లో పాత్ర
- గుట్టుగా సమాచారం సేకరించిన సీఎం
- అమరావతికి వెళ్లిన శాసన సభ్యులు

6లో

అవి 'సిరి'ధాన్యాలు

- కొండలపై చిరుధాన్యాల సాగు



మెళియాపుట్టి : గూడలో పండిస్తున్న గంటెలు

అమ్మా.. లెగమ్మా.. ఇంటికి వెళ్లిపోదాం!

- ఏకలవ్య పాఠశాలలో విద్యార్థిని ఆత్మహత్య
- దసరా సెలవుల అనంతరం తోటి స్నేహితులు రాకపోవడంతో మనస్తాపం
- 'ఇంకెప్పుడూ విడిచివెళ్లనంటూ'.. భోరున విలపించిన తల్లి
- సిబ్బంది నిర్లక్ష్యమే మృతికి కారణమని కుటుంబ సభ్యుల ఆందోళన



లావణ్య (ఫైల్)



లావణ్య మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి

పాతపట్నం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): దసరా సెలవుల అనంతరం తన కుమార్తెను ఆ తల్లి రెసిడెన్షియల్ పాఠశాలకు తీసుకెళ్లింది. తోటి స్నేహితులు ఎవరూ ఇంకా రాకపోవడంతో ఆ విద్యార్థిని ఇంటికి వెళ్లిపోదామని తన తల్లిని బతిమిలాడింది. కాగా.. రేపు మళ్లీ రావాలంటే కష్టమని, ఇక్కడే ఉండి బాగా చదువుకోవాలని ఆ తల్లి నచ్చజెప్పింది. మనస్తాపంతో తన గదికి వెళ్లిన ఆ విద్యార్థిని.. కొద్దిసేపటి తర్వాత ఆత్మహత్య చేసుకుంది. కుమార్తెను పాఠశాల వద్దకు దిగబెట్టి.. ఇంటికి బస్సులో వెళ్తుండగానే.. ఆ కన్నతల్లికి పిడుగులాంటి సమాచారం అందింది. వెంటనే ఆమె ఆస్పత్రికి చేరుకోగా.. విగతజీవిగా కనిపించిన కుమార్తెను చూసి.. బోరున విలపించింది. 'అమ్మా.. లెగమ్మా.. ఇంటికి వెళ్లిపోదాం! ఇంకెప్పుడూ నిన్ను విడిచి వెళ్లను' అంటూ ఆమె రోదన.. చూపరులకు కన్నీరు తెప్పించింది. కాగా.. పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యమే విద్యార్థిని మృతికి కారణమని కుటుంబ సభ్యులు ఆస్పత్రి వద్ద ఆందోళన చేశారు. పోలీసులు, ఐటీడీఏ వారితో చర్చించి న్యాయం చేస్తామని భరోసా ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

6లో



కేరాశింగి కొండల్లో చిరుధాన్యాల పంటలు

అవి సిరి ధాన్యాలు

జిల్లాలో పెరుగుతున్న విస్తీర్ణం..

జిల్లాలో 44,574.95 హెక్టార్లలో అటవీ ప్రాంతం ఉంది. అందులో పోడు పట్టాలు పొందిన రైతుల్లో కొందరు జీడిమామిడి పెంచుతున్నారు. కొంతమంది చిరుధాన్యాలు సాగు చేస్తున్నారు. సీతం పేట ఐటీడీఏ పరిధిలో 500 మంది రైతులు సుమారు 3,500 ఎకరాల్లో చిరుధాన్యాలు సాగు చేస్తున్నట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం గిరిజనులకు విత్తనాలు పంపిణీ చేయలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం సకాలంలో విత్తనాలు అందించడంతో సాగుకు అవకాశం కలిగిందని గిరిజన రైతులు చెబుతున్నారు. జిల్లాలో ఏటా చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెరుగుతోందని అధికారులు పేర్కొంటున్నారు.

వైద్యుల సూచనతో...

ప్రస్తుతం మన చుట్టూ ఉన్న వారిలో ఎక్కువ శాతం అధిక బరువు, మధుమేహం, ఎముకలు, కీళ్ల, కండరాల సమస్యలతో బాధ పడుతున్నారు. చిరుధాన్యాలు వినియోగిస్తే వీటి నుంచి కొంతవరకు ఉపశమనం ఉంటుందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. దీంతో వీటి వినియోగం గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం చిరుధాన్యాలతో చేసిన ఇడ్లీలు, దోసెలు, లడ్డూలు, ఉప్మా, రాగి, బిస్కెట్లకూ డిమాండ్ పెరిగింది. అంగన్‌వాడీ కేంద్రాలలో చిరుధాన్యాల వాడకాన్ని ప్రభుత్వం తప్పనిసరి చేసిన సంగతి తెలిసిందే.

- రైతులకు ఆదాయం... ప్రజలకు ఆరోగ్యం
- కొండలపై చిరుధాన్యాల సాగు
- గిరిజనుల పోడు వ్యవసాయంలో వీటికే ప్రాధాన్యం
- పెట్టుబడి తక్కువ... లాభాలు ఎక్కువ



● మెళియాపుట్టి మండలం కేరాశింగి గ్రామానికి చెందిన పి.కర్రయ్య అనే గిరిజన రైతు రెండేళ్లుగా మూడెకరాల్లో పోడు వ్యవసాయం చేస్తున్నాడు. చిరుధాన్యాలు సాగు చేస్తుండడంతో ఆర్థికంగా కలసి వస్తోందని చెబుతున్నాడు.



● మెళియాపుట్టి మండలం ఎగువబందపల్లి గ్రామానికి చెందిన సవర లక్ష్మీనారాయణ అనే ఈగిరిజన రైతు ఐదెకరాల పోడులో గంటెలు, జొన్నలు, కందులు పండిస్తున్నాడు. పెట్టుబడుల బాధ అంతగా ఉండదని... కాస్త కష్టపడితే ఆదాయం బాగుంటుందని చెబుతున్నాడు.

మెళియాపుట్టి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి):

'తిండి కలిగితె కండ కలదోయ్'.. అన్నారు మహాకవి గురజాడ..ప్రస్తుతం తిండి తీరే మారిపోయింది. కొన్నాళ్ల కిందటిలా ఇప్పుడు ఏది పడితే అది ఆహారంగా తీసుకుంటామంటే కుదరడం లేదు. చిన్న వయస్సులోనే మధుమేహం.. రక్తపోటు వంటి వాటి బారిన పడుతున్నారు. ఈ బాధల నుంచి ఉపశమనం కోసం ఇప్పుడు అత్యధిక శాతం చిరుధాన్యాల వైపు మొగ్గు చూపుతున్నారు. జిల్లా వ్యాప్తంగా చిరుధాన్యాల విక్రయాలు... ఆ స్థాయిలోనే వీటి విక్రయ కేంద్రాలూ పెరుగుతున్నాయి. అల్పాహారంగానూ వీటినే వినియోగిస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. పట్టణ ప్రాంతాల్లో రాగిజావ వినియోగించే వారి సంఖ్య కూడా అధికమవుతోంది. వీటితో పాటు గంటెలు, సామలు, జొన్న, కొర్రబియ్యం వంటి వాటికీ మార్కెట్‌లో డిమాండ్ పెరిగింది. దీని వల్ల చిరుధాన్యాలు సాగు చేస్తుంటే.. కలసి వస్తోందని గిరిజనులు ఆనందిస్తున్నారు. ఈ నేపథ్యంలో మూడేళ్లుగా చిరుధాన్యాల సాగు పెరుగుతున్నట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

ధరలు ఇలా...

ప్రస్తుతం చిరుధాన్యాలకు డిమాండ్ ఎక్కువగా ఉండడంతో వీటి ధరలూ అధికంగానే ఉంటున్నాయి. గంటెల ధర రూ.70, జొన్నలు రూ.75, రాగులు రూ.60, కొర్రలు రూ.110 వరకు పలుకుతున్నాయి. ప్రస్తుతం పంట దశలో ఉంది. డిసెంబరు ఆఖరుకు పంటలు చేతికి అందుతాయి. నూర్పుల సమయంలో ధరలు తగ్గుముఖం పడుతుండడం కనిపిస్తోంది.

ఆరోగ్యానికి ఎంతో మేలు..

బియ్యం, గోధుమలతో పోల్చుకుంటే చిరుధాన్యాల్లో పీచు పదార్థం, మాంసకృత్తులు, ఐరన్, కాల్షియం, ఎక్కువగా ఉంటాయి. దీని వల్ల మధుమేహం అదుపులో ఉండడంతో పాటు కండరాలు గట్టి పడటానికి ఉపయోగపడతాయి. మొదట్లో కొంచెం కొంచెంగా ఆహారంలో తీసుకుంటే జీర్ణ సంబంధిత సమస్యలు తలెత్తవు.

-జి.గణపతిరావు, ఆర్థోపెడిక్ వైద్యుడు

వర్షాలు కలిసి వస్తున్నాయి..

ఈసారి చిరుధాన్యాలు వేసిన మొదట్లోనే వర్షాలు కలిసి రావడంతో పోడు వ్యవసాయంలో పంట బాగుంది. ప్రస్తుతం చిరుధాన్యాలకు మంచి డిమాండ్ ఉంది. దీని వల్ల రైతులు లాభాలు పొందే అవకాశం కనిపిస్తోంది.

-డి.శరత్‌రెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి



నింగికీ.. నేలకూ వంతెన వేసినట్టు!

● కనువిందు చేసిన హరివిల్లు

ఆమదాలవలస, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆమదాలవలస పట్టణ ప్రజలను గురువారం ఉదయాన్నే రంగురంగుల ఇంద్రధనస్సు పలుకరించింది. తెల్లవారుజాము నుంచి పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో వర్షం కురిసింది. వర్షం ఆగిన కొద్దిసేపటికి సూర్యోదయ సమయంలో ఆకాశంలో హరివిల్లు ప్రత్యక్షమైంది. ఈ ఇంద్రధనుస్సును పట్టణ ప్రజలు ఆసక్తిగా తిలకించారు. కొంతమంది తమ సెల్‌ఫోన్ కెమెరాల్లో దీనిని బంధించారు.



శ్రీ చక్రాలకు పూజలు చేస్తున్న భక్తులు

రాజరాజేశ్వరికి పౌర్ణమి పూజలు

ఎచ్చెర్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కుంచాల కురమయ్యపేటలోని దేవీ ఆశ్రమంలో గురువారం పౌర్ణమి పూజలను ఘనంగా నిర్వహించారు. ఆశ్రమ పీఠాధిపతి తేజోమూర్తుల బాలభాస్కర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ చక్రాలకు భక్తులు కుంకుమ పూజలు నిర్వహించారు.



రాజరాజేశ్వరీ దేవికి హారతి ఇస్తున్న పీఠాధిపతి బాలభాస్కరశర్మ

అమ్మా.. లెగమ్మా.. ఇంటికి వెళ్లిపోదాం!



మృతురాలి కుటుంబ సభ్యులతో చర్చిస్తున్న సీతంపేట ఐటీడీఏ పీవో యశ్వంత్ కుమార్ రెడ్డి

- ఏకలవ్య పాఠశాలలో విద్యార్థిని ఆత్మహత్య
- దసరా సెలవుల అనంతరం తోటి స్నేహితులు రాకపోవడంతో మనస్తాపం
- 'ఇంకెప్పుడూ విడిచివెళ్లనంటూ'..

భోరున విలపించిన తల్లి

పాతపట్నం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పాతపట్నంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఏడో తరగతి విద్యార్థిని సవర లావణ్య (12) గురువారం ఆత్మహత్య చేసుకుంది. దసరా సెలవులు ముగిసి గురువారమే పాఠశాల తెరిచారు. గురువారం నాటికి 40 మంది విద్యా ర్థులు వచ్చారు. లావణ్యను తల్లి లక్కెమ్మ, కుటుంబ సభ్యులు గురువారం ఉదయం 11 సమయంలో పాఠశాలకు తీసుకెళ్లారు. కాగా.. తోటి విద్యార్థులు ఎవరూ ఇంకా పాఠశాలకు రాలేదని.. మళ్లీ రేపు వద్దాం అమ్మా.. అంటూ లావణ్య తన తల్లికి నచ్చజెప్పే ప్రయత్నం చేసింది. మళ్లీ రేపు తీసుకుని రావాలంటూ కష్టమని.. ఇక్కడే ఉండి చక్కగా చదువుకో అమ్మా అని ఆమె కూతురికి నచ్చజెప్పి ఇంటికి వెళ్లిపోయింది. మన స్తాపంతో తన గదికి చేరుకున్న లావణ్య.. కొద్దిసేపటి తర్వాత కిటికీకి రిబ్బన్ వేలాడదీసి ఆత్మహత్య చేసుకుంది. మధ్యాహ్న భోజనానికి రాకపోవడంతో సిబ్బంది వెళ్లి పరిశీలించారు. అపస్మారకస్థితిలో ఉన్న లావణ్యను స్థానిక సామాజిక ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి.. అప్పటికే మృతి చెందిందని నిర్ధారించారు. కుటుంబ సభ్యులకు పాఠశాల సిబ్బంది ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. తల్లి లక్కెమ్మ ఇంటికి చేరక ముందే ఈ సమాచారం అందడంతో ఆమె విలపిస్తూ.. ఆస్పత్రికి చేరుకుంది. విగతజీవిగా ఉన్న తన కుమార్తెను చూసి గుండెలవిసేలా రోదించింది. 'ఇంకెప్పుడూ ఇలా విడిచివెళ్లనమ్మా.. లెగు అమ్మా.. ఇంటికి వెళ్లిపోదాం' అంటూ బోరున విలపించింది. ఘటనా స్థలాన్ని తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్, ఎస్‌ఐ బి.లావణ్య పరిశీలించారు. ఘటనపై ఆరా తీశారు. కొత్తూరు సీఐ చింతాడ ప్రసాద్, మెళియాపుట్టి ఎస్‌ఐ రమేష్ మృతురాలి తల్లితో మాట్లాడి దర్యాప్తు చేస్తున్నారు.

● పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలం కొత్తగూడపంచాయతీ వంబరెల్లి (బుడ్డగూడ)కి చెందిన సవర లావణ్య 5వతరగతి వరకూ స్వగ్రామంలోనే చదువుకొంది. ఆరో తరగతి చదివేందుకు గతేడాది ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో చేరింది. లావణ్య పాఠశాలలో చురుగ్గా ఉండేదని, ఇలా అఘాయిత్యానికి పాల్పడతాదని ఊహించలేదని సిబ్బంది తెలిపారు. తండ్రి న్యాద్రూం లావణ్య చిన్నప్పుడే మృతి చెందాడు. అన్నయ్యలు అప్పారావు, రామయ్య ఉన్నారు. తల్లి లక్కెమ్మ కుటుంబ బాధ్యతలు చేపట్టి.. కూలి చేస్తూ పిల్లలను చదివిస్తోంది. లావణ్య మృతితో కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు.

మృతురాలి కుటుంబ సభ్యుల ఆందోళన

పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యం వల్లే లావణ్య మృతి చెందిందని.. విద్యార్థిని కుటుంబ సభ్యులు సామాజిక ఆస్పత్రి వద్ద గురువారం రాత్రి ఆందోళన చేశారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సీతంపేట ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్ రెడ్డి.. మృతురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. సాధ్యమైనంత వరకూ ప్రభుత్వం నుంచి సహాయం అందేలా చర్యలు చేపడతామని తెలిపారు. విద్యార్థిని మృతిపై నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు.

అధినేత వద్దకు తమ్ముళ్ల చిట్టా!

- నేడు ఎమ్మెల్యేలతో సీఎం చంద్రబాబు సమీక్ష
- కొంతమంది ఇసుకలో జోక్యం
- మరికొంతమందికి మద్యం దుకాణాల్లో పాత్ర
- గుట్టుగా సమాచారం సేకరించిన ముఖ్యమంత్రి
- జిల్లా నుంచి అమరావతికి వెళ్లిన శాసనసభ్యులు



శ్రీకాకుళం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం పార్టీ నాయకులు.. కార్యకర్తలు.. గత అయిదేళ్లు వైసీపీ నేతల చేతిలో తీవ్ర అవస్థలకు గురయ్యారన్నది వాస్తవం. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత అన్ని స్థాయిల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలకు స్వాతంత్ర్యం లభించినట్లయింది. కొందరు నాయకులు హుందాగా వ్యవహరిస్తున్నారు. మరికొందరు ఎమ్మెల్యేలు మాత్రం ద్వితీయ స్థాయి నాయకులు.. కీలక కార్యకర్తల కోరికలకు అడ్డు చెప్పలేని స్థితిలో ఉండిపోతున్నారు. ఎప్పటికప్పుడు ఇటు పార్టీ అధిష్ఠానం.. అటు కీలక అధికార యంత్రాంగం సైతం జిల్లాలో పరిస్థితిని గమనిస్తూ... ఎమ్మెల్యేలు.. నాయకులు... అవినీతి వైపు మరలకుండా హెచ్చరిస్తూనే ఉంది. అయినప్పటికీ చిలక్కొట్టుడులో కొంతమంది ముందుంటున్నారు. కొన్ని ప్రభుత్వ ప్రాధాన్య అంశాల్లో వేలు పెట్టి.. ఆ మకిలిని ఎమ్మెల్యేలకు అంటగడుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం అమరావతిలో రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించి సరైన సూచనలు ఇవ్వనున్నారు.

● మొన్నటి వరకు ఇసుక...

జిల్లాలో వంశధార, నాగావళి జీవనదులు ఉన్నాయి. పైగా ఇసుక నిల్వలు అపారంగా ఉన్నాయి. ఒడిశా సరిహద్దు ఉన్న ప్రాంతంలో సైతం శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఇసుక అధికంగా ఉంది. దీంతో నాయకుల కన్ను ఇసుకపై పడింది. నెల క్రితం వరకు ఇసుకలో ప్రత్యక్షంగా... పరోక్షంగా జోక్యం చేసుకుని.. వేర్వేరు బిల్లులతో విక్రయాలు జరిగేలా తెరవెనుక ఉండి ఇద్దరు ఎమ్మెల్యేలు తతంగం నడిపారు. ముఖ్యమంత్రికి సమాచారం చేరడం... పత్రికల్లో కథనాలు వెలువడటంతో తమకేమీ సంబంధం లేనట్లుగా వ్యవహరించారు. కార్యకర్తలు, కింది స్థాయి నాయకులు ఇసుక తరలింపులో ఇప్పటికీ జోక్యం చేసుకుంటున్నారు. 'ఐదేళ్లు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు మన వెంటే ఉన్నారు. ఇప్పుడు వారికి ఆ మాత్రం ఆదాయ మార్గం చూపెట్టకుంటే.. ఎలా?' అనే రీతిలో ఎమ్మెల్యేలు వ్యవహరిస్తున్నారు. జిల్లాలో మూడు నియోజకవర్గాల్లో ఇసుక పూర్తి స్థాయిలో ఉంది. అక్కడి నుంచే అటు విశాఖకు (త్వరలో).. ఇటు జిల్లా అంతటా తరలిస్తున్నారు. గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా.. పారదర్శకంగా పాలన ఉండాలన్నదే కూటమి ప్రభుత్వ ధ్యేయం కావడంతో ఎమ్మెల్యేలకు ఎప్పటికప్పుడు ఉన్నత స్థాయి నుంచి హెచ్చరిస్తూనే ఉన్నారు. అయినప్పటికీ కొన్నిచోట్ల తప్పులు దొర్లుతున్నాయి.

మద్యం దరఖాస్తులలోనూ...

ఇటీవల మద్యం దుకాణాలకు వ్యాపారులు దరఖాస్తు చేయకుండా.. ఒకవేళ చేస్తే తాము చెప్పినట్లుగా వినాల్సిందే అన్నట్లుగా కొందరు ఎమ్మెల్యేలు వ్యవహరించారు. ఈ నెల 9వ తేదీ వరకు మూడు నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు పరోక్షంగా వ్యాపారులకు హెచ్చరికలు జారీ చేశారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో వ్యాపారులను అడ్డుకుంటే పోలీసులను ఆశ్రయించ వచ్చని... ఎవరికీ భయపడకుండా దరఖాస్తు చేసుకోవచ్చని విస్తృత ప్రచారం చేసింది. దీంతో వ్యాపారులు భయాన్ని వీడారు. ఎమ్మెల్యేలు వెనక్కి తగ్గి... ఆపై సిండికేట్లలో వారు భాగస్వాములయ్యారు. ఇటు ఇసుక, అటు మద్యం విషయంలో తేడా వస్తే ప్రభుత్వానికి మరక అంటుకునే ప్రమాదం ఉంటుందనే విషయంలో అధినేత దీనిపై దృష్టి పెట్టినట్టు తెలుస్తోంది.

● ఎమ్మెల్యేల పనితీరుపైనా...

శ్రీకాకుళం జిల్లా నుంచి ఎమ్మెల్యేలు.. ప్రజాప్రతినిధుల పని తీరును ఇప్పటికే సీఎం చంద్రబాబు సేకరించారు. ఇసుక నుంచి మొన్నటి మద్యం దరఖాస్తుల వ్యవహారం వరకు ఆరా తీశారు. అందులో ప్రత్యక్షంగా.. పరోక్షంగా పాత్ర ఉన్న వారి విషయం చంద్రబాబుకు తెలిసిందని భోగట్టా. దీనిపై సమీక్షలో హెచ్చరించనున్నట్లు సమాచారం. తమ్ముళ్లు హద్దు మీరకుండా.. ఎమ్మెల్యేలు పారదర్శకంగా ఎలా ఉండాలి.. ఇప్పటి వరకు ఎలా ఉన్నారన్న దానిపైనా ముఖ్యమంత్రి సమీక్షలో ప్రస్తావించనున్నట్లు తెలిసింది. జిల్లాలో కొన్ని విషయాల్లో మూడు నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలపై వస్తున్న కొన్ని ఆరోపణలు.. కొన్ని వ్యవహారాలపై చంద్రబాబు వివరణ కోరనున్నట్లు తెలిసింది.

ఆదిత్యుని సన్నిధిలో సినీనటుడు తనికెళ్ల భరణి

అరసవల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రత్యక్షదైవం, ఆరోగ్య ప్రదాత అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామివారిని గురువారం ప్రముఖ సినీ నటుడు, రచయిత తనికెళ్ల భరణి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలికారు. అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు. ఈవో భద్రాజీ స్వామి వారి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇప్పిలి షణ్ముఖశర్మ, ఇప్పిలి రంజిత్ శర్మ, కార్తీక్, మూర్తి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు తులా సంక్రమణం, ఆశ్వయుజ పౌర్ణమి సందర్భంగా స్వామి వారికి క్షీరాభిషేకం చేశారు.



తనికెళ్ల భరణికి జ్ఞాపికను అందిస్తున్న ఈవో భద్రాజీ

తుఫాన్‌పై అప్రమత్తం

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): 'తుఫాన్ హెచ్చరికతో అప్రమత్తంగా ఉండాలి. సిబ్బంది కంట్రోల్ రూమ్‌కి వచ్చి పనిచేసే విధంగా ప్రొసీడింగ్స్ జారీ చేయాల'ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. గురువారం తన ఛాంబర్‌లో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి అధికారులతో సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ 'జిల్లాలో నాగావళి, వంశధార, బహుదా, తదితర నదుల గట్లు, కాలువ గట్లు, మరమ్మతులు ఏమైనా ఉంటే తక్షణమే ప్రతిపాదనలు అందజేయాలి. వరదకు సంబంధించి ముందస్తు అంచనా వేసే పరికరాలు లేకుంటే తక్షణమే ప్రతిపాదనలు పంపాలి. ఫ్లడ్ మోనటరింగ్ మీటర్లు అందుబాటులో ఉంచాలి. నియోజకవర్గానికి ఒకటి చొప్పున కంప్యూటర్ ఏర్పాటు చేయాలి. డివిజన్, మండల కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశాం. తుఫాన్ నష్ట సమాచారాన్ని కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నెంబరు 08942-240557కు తెలియజేయాలి' అని సూచించారు. ఆర్డీవో కె.సాయిప్రత్యూష, సీపీఓ లక్ష్మీప్రసన్న, జలవనరుల శాఖ అధికారులు, సెట్విన్ సీఈఓ ప్రసాదరావు, ఈడీఎం ఇంద్రసేన పాల్గొన్నారు.



పూలతో అలంకరణ

ఇచ్ఛాపురం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): శరత్ పౌర్ణమి సందర్భంగా జగన్నాథస్వామి ఆలయంలో కొలువై ఉన్న మహాలక్ష్మి దేవికి పంచామృతాలు, పండ్ల రసాలతో అభిషేకాలు చేసి ప్రత్యేకంగా పూజలు చేపట్టారు. గురువారం మహాలక్ష్మీదేవికి వివిధ రకాల పూలతో సహస్రనామార్చన చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సోంపేట, అక్టోబర్ 17 (ఆంధ్రజ్యోతి) : కొర్లాం సబ్‌స్టేషన్ పరిధిలో మామిడిపల్లి, రాజాం, గొల్లవూరు, టి.శాసనాం, బట్టిగళ్లూరు, కొత్తరాజాం, సిరిమామిడి, యర్రముక్కాం, ఉప్పలాం తదితర గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ జి.యజ్ఞేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు, ఇందుకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

కస్తూర్బా పాఠశాల పరిశీలన



విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు జిల్లా న్యాయాధికారి కిషోర్ బాబు

కంచిలి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జాడుపూడి కస్తూర్బా పాఠశాలను సోంపేట 6వ అదనపు జిల్లా న్యాయాధికారి కె.కిషోర్ బాబు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు ఉంటున్న గదులను, వంటశాలను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులకు ప్రభుత్వం నుంచి అందుతున్న సౌకర్యాలను ప్రిన్సిపాల్ రజనీ కుమారిని అడిగి తెలుసుకున్నారు. కంచిలి బాలుర వసతి గృహాన్ని పరిశీలించారు.

పరిసరాల అభివృద్ధిపై దృష్టి సారించాలి



చిలకపాలెం ఉన్నత పాఠశాలను పరిశీలిస్తున్న న్యాయాధికారి సన్యాసినాయుడు

ఎచ్చెర్ల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పరిసరాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. చిలకపాలెం, ఎచ్చెర్లలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, ఫరీద్‌పేట, కుశాలపురంలోని పాఠశాలలను గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకం అమలుపై ఆరా తీశారు. అనంతరం చట్టాలపై అవగాహన కల్పించారు.

'పల్లె పండుగ'తో గ్రామాల అభివృద్ధి

● శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం రూరల్/గార, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పల్లెల అభివృద్ధే లక్ష్యంగా 'పల్లె పండుగ కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్నట్టు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. రూరల్ మండలం కల్లేపల్లి, పీజీ పేట, నైరా, పొన్నాం, బట్టేరు గ్రామాల్లో అభివృద్ధి పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ప్రజలు తమపై ఉంచుకున్న నమ్మకాన్ని ఒమ్ముచేయకుండా గ్రామాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో, కూటమి నాయకులు సీర రమణ, మూకళ్ల శ్రీనివాసరావు, జయానంద్, దుంగ శ్రీధర్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు. అలాగే గార మండలంలో ఎస్.మత్స్యలేశం, బలరాంపురం, గొంటి, రామచంద్రపురం గ్రామాల్లో నిర్వహించిన పల్లెపండగలో ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొని అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు, పెద్దలు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధే చంద్రబాబు అజెండా

● ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్

ఆమదాలవలస, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ముఖ్యమంత్రి చంద్రబాబు అజెండా అని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. గురువారం వంజంగి, దూసిపేట గ్రామాల్లో నిర్వహించిన పల్లె పండగలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్య క్రమంలో కూటమి నాయకలు తమ్మినేని అప్పలనాయుడు, విద్యాసాగర్, నూకరాజు, సనపల డిల్లేశ్వరరావు, కంచరాన లోకేష్, తమ్మినేని చంద్రశేఖర్, పైడి లక్ష్మి, ఎంపీడీవో రోణంకి వెంకటరావు, వి.బాలమురళీకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

పెద్దపేటలో పల్లె పండుగ

బూర్జ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పెద్దపేట పంచాయతీలో పల్లె పండుగ కార్యక్రమం గురువారం నిర్వహించారు. రాష్ట్ర మార్కెట్ ఫెడ్ డైరెక్టర్ అనెపు రామకృష్ణంనాయుడు పాల్గొని వివిధ పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఎంపీడీవో తిరుపతిరావు, కూటమి నాయకులు, సచివాలయ ఇబ్బంది పాల్గొన్నారు.



గార: ఎస్.మత్స్యలేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

పల్లెల్లో అభివృద్ధే లక్ష్యం

● నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అభివృద్ధే లక్ష్యంగా 'పల్లెపండగ' కార్యక్రమం చేపడుతున్నామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. ఉప్పరిపేట, డోలపేట గ్రామాలను అనుసంధానం చేస్తూ లుకలాం వరకు రూ.2 కోట్లతో రోడ్డు పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. చిక్కాలవలస, కోమర్తి పంచాయతీ లకిమేర గ్రామాల్లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు శిమ్మ చంద్రశేఖర్, బగ్గు అర్చన, పంగ బావాజీ నాయుడు, శిమ్మ జగన్నాథం, అడపా చంద్రశేఖర్, యాళ్ల వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ఉప్పరిపేట-డోలపేట గ్రామాల్లో కనీస సౌకర్యాలు లేని పరిస్థితిపై ఆగస్టులో 'ఆంధ్రజ్యోతి' లో ప్రచురితమైన కథనానికి ఎమ్మెల్యే స్పందించి పనులకు శ్రీకారం చుట్టడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తంచేశారు.



ఆమదాలవలస: దూసిపేటలో ఎమ్మెల్యే రవికుమార్..



నరసన్నపేట: శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బగ్గు



శ్రీకాకుళం కలెక్టరేట్: వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ తదితరులు



శ్రీకాకుళం క్రైం: జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ..



సరుబుజ్జిలి: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..



నరసన్నపేట: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..



ఇచ్ఛాపురం: కొళిగాం జడ్పీ ఉన్నత పాఠశాలలో..



కోటబొమ్మాళి: ఊడికలపాడు శ్రీరామక్షేత్రంలో..

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): వాల్మీకి మహర్షి జయంతి గురువారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్వో ఎం.అప్పారావు, బీసీ సంక్షేమాధికారిణి అనూరాధ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో బి.మీనాక్షి, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, ఆర్‌వోఐ దుర్గారావు, గిరిజన సంక్షేమ శాఖ ఏటీడబ్ల్యూవో ఎం.శ్రీనివాసరావు, విద్యాశాఖ ఏడీ లియాఖత్ ఆలీఖాన్, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక ప్రదాత వాల్మీకి

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): దేశానికి ఆధ్యాత్మిక జ్ఞానాన్ని అందించిన మహనీయుడు వాల్మీకి మహర్షి అని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి కొనియాడారు. వాల్మీకి జయంతి సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఎస్పీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రి, కార్యాలయ ఏవో సీహెచ్ గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.



టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..



నందిగాం: శాఖాగ్రంథాలయంలో..





పోలాకి, మందస: ఎంపీడీవో కార్యాలయాల్లో..



దీక్ష చేస్తున్న యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

మున్సిపల్ టీచర్ల సమస్యల పరిష్కరించాలి

గుజరాతీపేట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సుదీర్ఘ కాలంగా అపరిశృతంగా మున్సిపాలిటీ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరించాలని కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో డీఈవో కార్యాలయం ఎదుట గురువారం దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీ టీచర్లపై రాష్ట్ర ప్రభుత్వం సవతితల్లి ప్రేమ చూపిస్తోందని, ఇప్పటివరకు మున్సిపల్ హైస్కూల్స్‌లో తగినంతమంది ఉపాధ్యాయుల లేరన్నారు. కొద్ది నెలల కిందట విలీనం చేశారే తప్పా బోధించడానికి స్కూల్ అసిస్టెంట్లు ఇవ్వలేదన్నారు. మున్సిపల్ హెచ్ఎంలను అర్బన్ ఎంఈవోలుగా నియమించాలని, నాన్‌టీచింగ్ సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లకు పరిష్కారం చూప కపోతే ఈ నెల 22న డైరెక్టరేట్ వద్ద 24 గంటల ధర్నా చేపడతామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.బాబురావు, బి.శ్రీరామ్మూర్తి, జిల్లా కార్యదర్శి టీవీ భాస్కరరావు, ఎస్.స్వర్ణకుమారి, మున్సిపల్ విభాకం కన్వీనర్ పి.సూర్యప్రకాషరావు, సంఘ ప్రతినిధులు చౌదరి రవీంద్ర, గొంటి గిరిధర్, టి.సీతారాం, టి.వైకుంఠరావు, తాతారావు, ప్రసాద్, ప్రదాన్, కె.శాంతి ప్రియ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీటీ స్కాన్ ప్రారంభం



మిషన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అశోక్, ఎమ్మెల్సీ నర్తు

ఇచ్ఛాపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం పట్టణ పరిధి పకీర్‌పేట వద్ద వసంతి నర్సింగ్ హోంలో నూతనంగా ఏర్పాటు చేసిన సిటీ స్కాన్ మిషన్‌ను ఎమ్మెల్యే బెందాళం అశోక్, ఎమ్మెల్సీ నర్తు రామారావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పట్టణ ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఇలాంటి సదుపాయాలు కల్పించడం అభినందనీయమన్నారు. నర్సింగ్‌హోం వ్యవస్థాపకులు డాక్టర్ దక్కత త్రినాథరెడ్డి, రిటైర్డు డిప్యూటీ సివిల్ సర్జన్ మోహన్‌రావు రౌలో, వైద్యులు రాజేంద్రప్రసాద్, దక్కత రాజ్‌కుమార్, ఏవీ రామకృష్ణ, గోవిందరెడ్డి, సీడాప్ మాజీ చైర్మన్ శ్యాంప్రసాద్‌రెడ్డి, కూటమి నేతలు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అనుమానితుల సమాచారం ఇవ్వండి

ఇచ్ఛాపురం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో దొంగతనాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అనుమానితులు ఎవరైనా తారాసపడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని రూరల్ ఎస్ఐ శ్రీనివాసరావు అన్నారు. గురువారం లొద్దపుట్టి గ్రామాన్ని సందర్శించిన ఆయన గ్రామసభ నిర్వహించి మాట్లాడారు.

బాలల సంరక్షణ కేంద్రాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బాలల సంరక్షణ కేంద్రాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారుల ను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయ సమా వేశ మందిరంలో బాలల రక్షిత గృహాల నిర్వహణపై సంబంధింత అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధు లతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 11 బాలల సంరక్షణ కేంద్రాలు రిజిస్ట్రేషన్ లేకుండా నడుస్తున్నట్టు గుర్తించామన్నారు. రిజిస్ట్రేషన్ లేకుండా నిర్వహించే వాటిపై కేసులు నమోదు చేయాలన్నారు. అనుమతులు లేని బాలల సంరక్షణా కేంద్రాలను తక్షణమే మూయించాలని ఆదేశించారు. ఇటువంటి కేంద్రాల్లో ఉన్న బాలలను ప్రభుత్వ వసతి గృహాల్లో చేర్పించాలన్నారు. వసతి గృహాల్లో సీట్ల కేటాయింపునకు డీఈవో, ఐసీడీఎస్ పీడీలతో కమిటీ ఉంటుందని, బాలల కోసం ఫిర్యాదులు వస్తే కమిటీకి తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా 'మునగ చెట్టు మహిళల ఆరోగ్యానికి తొలి మెట్టు' అనే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, డీఎంహెచ్‌వో బి.మీనాక్షి, బాలల సంరక్షణాధికారి కె.రమణ పాల్గొన్నారు.

నేడు అంగన్‌వాడీల్లో సామూహిక సీమంతాలు, అన్నప్రాసన

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం 'కమ్యూనిటీ బేస్డ్ ఈవెంట్స్'లో భాగంగా సామూహిక సీమంతాలు, అన్నప్రాసన కార్యక్ర మాలు నిర్వహించాలని ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రక్తహీనతను నివారించేందుకు మునగ, కరివేపాకు ఆకు పొడిని ఆహా రంలో భాగంగా తీసుకోవాలని తెలియజేసే 'మార్నింగ్ డే' ని నిర్వహిస్తామన్నారు. ప్రతీ రోజూ తినే మెనూలో మునగాకు పొడిని తప్పనిసరిగా చేర్చాలని తెలిపారు.

వివరాలు అప్‌లోడ్ చేయండి



ఎంఈవోలతో మాట్లాడుతున్న డీఈవో

గార, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రతీరోజూ అందిస్తున్న మధ్యాహ్న భోజన సమాచారం, టాయిలెట్స్ నిర్వహణతో పాటు పుస్తకాలు పంపిణీకి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేస్తుండాలని డీఈవో ఎస్.తిరుమల చైతన్య మండల విద్యాశాఖాధికారులకు ఆదేశించారు. గురువారం ఉదయం ఆయన గారలో మండల రీసోర్స్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈవోలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు నక్క రామకృష్ణ, టి.వినోదిని ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఏవోకి సత్కారం

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సహాయ పరిపాలన అధికారిగా విధులు నిర్వహిస్తున్న జి.సత్యశోభారాణి పదోన్నతి పొంది విజయనగరం జిల్లా ఏపీఎస్పీ ఐదో బెటాలియన్ పరిపాలన అధికారిగా బదిలీ అయింది. దీంతో గురువారం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, కార్యాలయ సిబ్బంది ఆమెను సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో కార్యాలయ ఏవో సీహెచ్ గోపినాథ్, కార్యాలయ సూపరింటెండెంట్ కోటేశ్వరరావు, బాలరాజు, లిల్లీభాయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన అధికారులు

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డిని గురువారం పలువురు పోలీసు అధికారులు మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా బాధ్యతలు చేపట్టిన ఏపీఎస్పీ మొదటి బెటాలియన్ అదనపు కమాండెంట్ పి.సత్తిబాబు, కాశీబుగ్గ రూరల్ సీఐ ఎం.తిరుపతిరావు, డీసీఆర్‌బీ ఎస్ఐ ఎండీ అమీర్ ఆలీ ఎస్పీని కలుసుకున్నారు.

'తప్పుడు కూతలు మానుకోండి'

ఆమదాలవలస, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో వైసీపీ ఇన్‌చార్జి పదవి కోసం పోటీపడుతున్న ఆ పార్టీ నాయకులు ఇతరులపై తప్పుడు కూతలు మానుకోవాలని టీడీపీ రాష్ట్ర న్యాయ విభాగ కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర అన్నారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు బోర గోవిందరావు, తంగి గురయ్యలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో ఉన్న నాలుగు వైసీపీ గ్రూప్‌లు ఆధిపత్య పోరులో భాగంగా ఎమ్మెల్యే కూన రవికుమార్‌ను అసత్య ఆరోపణలతో పోటాపోటీగా విమర్శించడం పనిగా పెట్టుకున్నారన్నారు. నిస్వార్థ రాజకీయాలతో ప్రజల మధ్య నిరంతర శ్రామికుడికి శ్రమిస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్‌ను లక్ష్యంగా పెట్టుకొని విమర్శించడం అంతా గమనిస్తున్నారన్నారు. టీడీపీ నాయకులు నాగళ్ల మురళీధర్‌యాదవ్, జీడీ ప్రసాద్, విశ్వనాథం పాల్గొన్నారు.

సరసమైన ధరలకే వంటనూనె

● జిల్లాలో 84 కౌంటర్లు ఏర్పాటు

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ఇటీవల బహిరంగ మార్కెట్‌లో వంటనూనెల ధరలు పెరగడంతో సామాన్య ప్రజలకు వంట నూనెలు సరసమైన ధరలకు అందజేయాడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా జిల్లాలో 84 ప్రత్యేక కౌంటర్ల ద్వారా పామాయిల్ 1లీ. రూ.110, సన్ ఫ్లవర్ ఆయిల్ 1లీ. రూ.124లకే విక్రయించనున్నట్లు జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సన్‌ఫ్లవర్ ఆయిల్ నెలకు 1లీ, పామాయిల్ 3లీ. చొప్పున రేషన్ కార్డులపై అందిస్తామన్నారు.

రెగ్యులర్ చేయాలి

సోంపేట, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. బారువ కళాశాలలో పసుపు రిబ్బన్లు ధరించి కాంట్రాక్టు అధ్యాపకులు విధులకు హాజరై తమ నిరసన తెలిపారు. 2023 వచ్చిన జీవో 114ను అమలు చేయాలని కోరారు.

క్రైం కార్నర్

భార్య, ప్రియుడిని హతమార్చి.. ఆత్మహత్య

● తాపీమేస్త్రీ కుటుంబంలో విషాదం

● బెంగళూరులో ఘటన


గణేశ్, గొల్లబాబు, లక్ష్మి (ఫైల్‌ఫొటోలు)

బెంగళూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): వలస కూలీలుగా బెంగళూరుకు వచ్చిన తాపీమేస్త్రీ కుటుంబంలో విషాదం నెలకొంది. తన భార్య లక్ష్మితోపాటు కొన్నేళ్ల క్రితం బెంగళూరుకు వచ్చిన గొల్లబాబు (50), ఆర్‌బీఐ లే అవుట్ సోమేశ్వర కాలనీలో భవన నిర్మాణ పనులు చేస్తూ, తాత్కాలిక షెడ్‌లో ఉంటున్నారు. గొల్లబాబుకు పరిచయం ఉన్న గణేశ్‌కుమార్ వీరింటికి వచ్చేవాడు. ఈ క్రమంలో కొన్నాళ్ల నుంచి లక్ష్మి, గణేశ్‌కుమార్ సన్నిహితమయ్యారు. విషయం తెలుసుకున్న బాబు.. మరోసారి గణేశ్‌ను ఇంటికి రానివ్వకుండా కట్టడి చేయాలని భార్యను హెచ్చరించాడు. ఈ క్రమంలో బుధవారం పనికి వెళ్లిన బాబు, వర్షం కారణంగా పనిలేక మధ్యలోనే ఇంటికి వచ్చాడు. అప్పటికే భార్య లక్ష్మి(40), గణేశ్‌కుమార్ (20) కలిసి ఉండటంతో ఆవేశంతో కట్టెతో ఇద్దరిపై దాడి చేసి హతమార్చాడు. ఆ తరువాత అదే భవనంలోని ఓ కిటికీకి ఉరి వేసుకున్నాడు. భవన యజమానికి స్థానికులు సమాచారం ఇవ్వడంతో ఆయన కోణనకుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ముగ్గురి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. దంపతులది ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా అని పోలీసులు తెలిపారు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు.

నేరాలకు పాల్పడితే రౌడీషీట్

● కత్తితో దాడికి చేసిన వ్యక్తి అరెస్టు.. 14 రోజుల రిమాండ్

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): నగరంలోని దమ్మలవీధిలో బుధవారం ఓ వ్యక్తి కత్తితో దాడి చేసిన ఘటనలో నిందితుడి దుర్గా ప్రసాద్‌ను గురువారం ఒకటో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. కోర్టు అతడికి 14 రోజుల రిమాండ్ విధించింది. ఈ సందర్భంగా ఎస్ఐ హరికృష్ణ విలేకరులతో మాట్లాడుతూ.. దమ్మల వీధిలో జరిగిన ఘటనలో నిందితుడు దుర్గా ప్రసాద్‌కు బాధితుడు పుక్కళ్ల రాము అలియాస్ సతీష్‌కు మధ్య ఇటీవల జరిగిన గొడవల కారణంగానే దాడికి పాల్పడ్డాడని తెలిపారు. గొడవ జరిగిన వెంటనే పోలీసులను ఆశ్రయించకుండా బయట పంచాయతీలు చేయడం దాడికి పరోక్షంగా కారణమైందని వివరించారు. ఇటీవల నగరంలో జరుగుతున్న దాడుల నేపథ్యంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు పాత నేరస్థులతో పాటు వన్‌టౌన్ పరిధిలో నేర చరిత్ర కలిగిన ప్రతీ ఒక్కరిపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. ఇకపై ఎవరైనా ఇటువంటి ఘటనలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే రౌడీషీట్ తెరిచేందుకు వెనకాడబోమని స్పష్టం చేశారు. గొడవ జరిగినప్పుడు పోలీసులను ఆశ్రయించాలని బయట పంచాయితీలు మానుకోవాలని వివరించారు.

సనపల సురేశ్‌పై కేసు నమోదు

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): తమను సనపల సురేష్ అనే వ్యక్తి దారికాసి కారుతో ఢీకొట్టి హత్య చేయబోయాడని తమ్మినేని అశోక్, వెంకట సింహాచలం శ్రీకాకుళం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్ఐ పి.కిషోర్ వర్మ సురేష్‌పై హత్యాయత్నం సెక్షన్లపై కేసు నమోదు చేశారు. వెంకట సింహాచలం, తమ్మినేని అశోక్ వేర్వేరుగా ద్విచక్రవాహనాలపై బుధవారం శ్రీకాకుళం వెళ్తుండగా కారులో అతి వేగంగా వచ్చిన సనపల సురేష్ ఢీకొట్టాడు. దీంతో వారిద్దరికి తీవ్ర గాయాలు కావడంతో రిమ్స్‌లో చేరారు. ఔట్ పోస్టు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సురేష్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. ఇదిలా ఉండగా సనపల సురేష్ శ్రీకాకుళం వస్తుండగా అతడిపై నలుగురు వ్యక్తులు దాడి చేశారని రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ జి.ఉమామహేశ్వరరావు వారిపై కేసు నమోదు చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

పొందూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): బి.కంచరాం సమీప తోటలో పేకాట శిబిరంపై గురువారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురు పేకాటరాయుళ్లు పట్టుబడ్డారు. వారినుంచి రూ.30 నగదు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ సత్యనారాయణ వారిని అరెస్టు చేసి కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బూర్జ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నీలాదేవిపురంలో నివాసం ఉంటున్న కంచిపల్లి తవిటినాయుడు (44) అనే వ్యక్తి బుధవారం రాత్రి గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. నాలుగేళ్ల కిందట రోడ్డు ప్రమాదం లో ఆయన కాస్త మతి స్థిమితం కోల్పోయాడు. ఆయన భార్య కన్నవారింటికి ఓ శుభకార్యానికి వెళ్లడంతో ఇంటిలో అపస్మారక స్థితికి చేరుకోవడంతో స్థానికులు గుర్తించి శ్రీకాకుళం రిమ్స్‌కి తరలించగా.. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళలు ఆర్థిక పరిపుష్టి సాధించాలి

పలాసరూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థిక పరిపుష్టి సాధించాలని డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్ అన్నారు. మండల వెలుగు భవనంలో పలాస, వజ్రపుకొత్తూరు, కంచిలి, ఇచ్ఛాపురం, కవిటి, సోంపేట మండలాల వెలుగు అధికారులు, మహిళాసంఘాల ప్రతినిధులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు వ్యాపారాల్లో రాణించాలంటే ప్రత్యేక లక్ష్యసాధనతో కృషి చేయాలన్నారు. మార్కెట్ పరిస్థితిని గమనించి మెలకువలతో ఉత్పత్తులను తయారు చేయాలన్నారు. ప్రస్తుత మార్కెట్‌లో ఓఎండీసీ ద్వారా ఆన్‌లైన్ బిజినెస్‌లో ప్రగతి సాధించాలని సూచించారు. సమావేశంలో డీపీఎంలు చింతాడ రామ్మోహన్, ఎల్‌హెచ్ నారాయణరావు, మోహనరావు, డీపీఎం నాగలక్ష్మి, ఏజీఎం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి

సంతబొమ్మాళి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మహిళలు స్వయం ఉపాధి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఆర్థికాభివృద్ధి సాధ్యపడుతుందని డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్ అన్నారు. గురువారం సీతానగరంలో మహిళల సంఘాల తయారీలను పరిశీలించారు. ఈ ఉత్పత్తులు ఆన్‌లైన్ మార్కెటింగ్ ద్వారా విక్రయించి సభ్యుల ఆదాయం పెంచేందుకు సెర్ప్ చర్యలు తీసుకుంటోంద న్నారు. కార్యక్రమంలో డీపీఎంలు నారాయణరావు, నాగలక్ష్మి, ఏరియా కో-ఆర్డినేటర్ శ్రీరాములు, ఏపీఎం సూర్యనారాయణ పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 67 మంది ఎంపిక

టెక్కలి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు గురువారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాకు నాలుగు ప్రైవేట్ సంస్థలు హాజరుకాగా 67మంది నిరుద్యోగులు వివిధ కంపెనీలకు ఎంపికయ్యారు.

ఇన్‌చార్జి ఆర్డీవోగా కృష్ణమూర్తి


ఇన్‌చార్జి ఆర్డీవోను అభినందిస్తున్న రెవెన్యూ సిబ్బంది

పలాస, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పలాస ఇన్‌చార్జి ఆర్డీవోగా టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి ఆర్డీవో బి.సుదర్శన్‌దొర అస్వస్థతకు గురై విశాఖపట్నంలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరిన సంగతి తెలిసిందే. ఆయన స్థానంలో కృష్ణమూర్తిని కలెక్టర్ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయనను సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

ఘనంగా తులా సంక్రమణ హోమం

పలాసరూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పలాస సీతారామాలయ కాంప్లెక్స్‌లోని జగన్నాథ ఆలయంలో జైజగన్నాథ్ ఒడియా బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో గురువారం తులా సంక్రమణ హోమం చేపట్టారు. ప్రతినెలా లోకకల్యాణం కోరుతూ హోమం చేపడుతున్నట్లు సంఘ కార్యదర్శి బాబూరావు పండా తెలిపారు.

వెల్లివిరిసిన ఆధ్యాత్మికత

● గౌరి పౌర్ణమి, నందన్న ఉత్సవాలతో సందడి

జిల్లాలోని గురువారం ఆధ్యాత్మిక సందడి నెలకొంది. గౌరీ పౌర్ణమిని పురస్కరించుకుని మహిళలు గౌరమ్మను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. ముత్తయిదువులకు వాయినాలిచ్చారు. అలాగే గ్రామాల్లో నందన్న, నందెమ్మల విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నందన్న విగ్రహాలను ఊరేగించి భక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు.

-ఆంధ్రజ్యోతి బృందం


జలుమూరు: అబ్బాయిపేటలో నందెమ్మకు పూజలు చేస్తున్న భక్తులు


హిరమండలం: గ్రామంలో నందన్న ఊరేగింపు


కొత్తూరు: గౌరీదేవికి పూజలు చేస్తున్న మహిళలు


పోలాకి: గౌరమ్మకు నమస్కరిస్తూ..


సంతబొమ్మాళి: గౌరీపౌర్ణమి పూజలు



టెక్కలి, నందిగాంలలో గౌరమ్మలకు పూజలు చేస్తున్న మహిళలు



శ్రీకాకుళం కల్చరల్: ఉమాజఠలేశ్వరాలయంలో, పలాస రూరల్: కేదారిపురంలో నందెన్న

అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలి

నరసన్నపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించే దిశలో ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో ఉప్పాడ శాంతారావు అన్నారు. గురువారం దేవాది పాఠశాలన ఆయన పరిశీలించారు. విద్యార్థుల సామార్థ్యాలను పరిశీలించారు. రాయడం, చదవడంతో పాటు గణితంలో ప్రాథమిక భావనలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం ఎండీఎంను పరిశీలించారు.

ధాన్యం కొనుగోలుపై శిక్షణ

నరసన్నపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను పాటించాలని సివిల్‌సప్లయ్స్ టెక్నికల్ అసిస్టెంట్ గాయిత్రి అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, వీపీఏ, సీసీలకు ధాన్యం కొనుగోలుపై శిక్షణ ఇచ్చారు. పంటకోత ప్రయోగాలు శాస్త్రీయంగా చేపట్టాలన్నారు. తేమశాతంతో సంబంధం లేకుండా ధాన్యం తీసుకుని రైతులకు ఇష్టం వచ్చిన మిల్లుకు విక్రయించేలా ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందన్నారు. మిల్లర్లు అక్రమాలకు పాల్పడకుండా పర్యవేక్షించా లన్నారు. కార్యక్రమంలో ఏవో సునీత, డీటీలు సరిత, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు క్లీనింగ్ కెమికల్స్ పంపిణీ

హిరమండలం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు, పరిసరాలను శుభ్రం చేసేందుకు గాను ప్రభుత్వం నుంచి క్లీనింగ్ కెమికల్స్ వచ్చినట్లు ఎంఈవో కె.రాంబాబు తెలిపారు. మండలంలో 60 పాఠశాలలకు వీటిని పంపిణీ చేశామన్నారు. వీటిని వినియోగించి పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు.

'వసతి గృహాల్లో పరిశుభ్రత లేదు'

కోటబొమ్మాళి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వసతి గృహాల్లో పరిశుభ్రత పాటించడం లేదని, దీనివల్ల విద్యార్థులు వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని స్థానిక జూనియర్ సివిల్ న్యాయాధికారి బీఎంఆర్ ప్రసన్నలత అన్నారు. రాష్ట్ర న్యాయసేవా సంఘం ఆదేశాల మేరకు కోటబొమ్మాళిలోని బీసీ బాలురు, సోషల్ వెల్ఫేర్ బాలికల వసతి గృహాలను గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల వసతి, భోజన, వైద్యం, విద్య తదితర అంశాలను తనిఖీ చేశారు. ఎస్సీ బాలికల హాస్టల్‌లో పరిశుభ్ర పాటించకపోవడం, భవనం శిథిలావస్థకు చేరుకున్నాయని ఆమె తెలిపారు. కోర్టు, వసతిగృహాల సిబ్బంది పాల్గొన్నారు.

శబరిమలైకి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

టెక్కలి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): శబరిమలై యాత్రకు వెళ్లే అయ్యప్పభక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక అద్దె బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు టెక్కలి డిపో మేనేజర్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. మూడురకాల ప్యాకేజీలతో ప్రత్యేక బస్సులు నడుపుతు న్నామన్నారు. ఐదురోజుల ప్యాకేజీలో విజయవాడ, ఎరుమేలి, పంబ, అయ్యప్పస్వామి సన్నిధానం, శ్రీపురం, కాణిపాకం, తిరుపతి, అన్నవరం, సింహాచలం మీదుగా టెక్కలి చేరుకుంటుందన్నారు. ఏడు రోజుల ప్యాకేజీలో పై వాటికి అదనంగా మధురై, రామేశ్వరం, 11 రోజుల ప్యాకేజీలో గురువాయర్, తివేంద్రం, కన్యాకుమారి, మధురై, శ్రీరంగం, కంచి వంటి ప్రదేశాలుంటాయన్నారు. ఇతర వివరాలకు 99592 25611 నెంబరులో సంప్రదించాలని కోరారు.

కిచెన్‌గార్డెన్ నిర్వహణపై అవగాహన

టెక్కలి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో కిచెన్‌గార్డెన్ నిర్వహణపై టెక్కలి ఐసీడీఎస్ అధికారులు అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శిక్షణ నిర్వహించారు. కార్యక్ర మంలో ఐసీడీఎస్ పీవో శోభారాణి, ఎంపీడీవో సీహెచ్ లక్ష్మీభాయి తదితరులు పాల్గొన్నారు.

నిత్యం ఇదే పరిస్థితి..


గురువారం గొయ్యిలో కూరుకుపోయిన లారీ

హిరమండలం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): హిరమం డలం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని అలికాం-బత్తిలి ప్రధాన రహదారిపై పెద్ద గొయ్యి ఏర్పడి ప్రమాదకరంగా మారింది. ప్రతి రోజూ భారీ వాహనాలు ఈ గోతిలో దిగబడి గంటల తరబడి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గొయ్యిని పూడ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టకపోవడంపై ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. గడచిన వారం రోజుల్లో మూడు లారీలు ఇలా గోతిలో కూరుకు పోయాయి. ఇప్పటి కైనా ఆర్‌అండ్‌బీ అధికా రులు స్పందించి తగు చర్యలు తీసుకుని ప్రమాదాలను నివారించాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

అంతర్జాతీయ స్థాయికి పలాస జీడి పరిశ్రమలు

● ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు


తిరుమలకు తరలించే జీడి పప్పు నాణ్యతను పరిశీలిస్తున్న ఏపీటీపీసీ చైర్మన్ బాబూరావు

పలాస, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పలాస జీడి పరిశ్రమలను అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లేందుకు చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ (ఏపీటీపీసీ) చైర్మన్ వజ్జ బాబూరావు అన్నారు. గురువారం పలాస పారిశ్రామికవాడలోని జీడిపరిశ్రమల సముదాయాలను సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. జీడి పరిశ్రమలకు మహర్దశ రానుందని, తిరుపతి వెంకన్న ఆలయానికి కూడా పలాస జీడిపప్పు పంపుతుండడం శుభపరిణామమన్నారు. ఎమ్మెల్యే గౌతు శిరీష, మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, రామ్మోహన్ నాయుడు సహకారంతో అన్ని ఆలయాల్లో మొక్కజీడి పప్పును ప్రమోషన్ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో ఏపీటీపీసీని అగ్రగామి సంస్థగా చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటవుతున్న హార్బర్ల వద్ద తమ సంస్థకు పది ఎకరాలు చొప్పున స్థలాలివ్వాలని కోరామని, అందుకు సీఎం అంగీకరించారన్నారు. పక్కా గిడ్డంగులు నిర్మించి ప్రభుత్వానికి ఆదాయం తెచ్చిపెడతామన్నారు. అంతకు ముందు బాబూరావుకు వ్యాపారవేత్త సంతోష్‌కుమార్ సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు డొక్కరి శంకర్, యవ్వారి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పత్రి కొమ్మల పండగ


నరసన్నపేట: భవానీపురంలో కొమ్మల పండగ నిర్వహిస్తున్న రైతులు

నరసన్నపేట/పోలాకి/సరుబుజ్జిలి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పలు గ్రామాల్లో గురువారం పత్రి కొమ్మల పండగను నిర్వహించారు. నరసన్నపేట పట్టణంలోని భవానీపురం, నేతింటివీధి, కోమర్తి, తామరాపల్లి, కంబకాయి, ఉర్లాం, రెల్లివలస, సుందరాపురం, పోలాకి మండల దీర్ఘాసి , సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురం తదితర గ్రామాల్లో రైతులు అసిరితల్లి, చిలకమ్మ అమ్మవార్ల ఆలయాలకు వెళ్లి పత్రికొమ్మలను వేసి ప్రత్యేక పూజలు చేశారు. పంటలు బాగా పండాలని కోరుకుంటూ పొలాల్లో పత్రి కొమ్మలను వేసి పూజలు చేశారు.



పోలాకి: దీర్ఘాశి, సరుబుజ్జిలి: పురుషోత్తపురంలో పత్రి కొమ్మల ఉత్సవం నిర్వహిస్తున్న రైతులు

ఉత్తమ విలన్‌గా కుమార్‌నాయక్‌కు అవార్డు

పలాస, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గకు చెందిన ప్రముఖ జానపద రంగస్థల, సినీ కళాకారుడు కుమార్‌నాయక్‌కు ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లో ఇండియన్ ఫిలిం మేకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉత్తమ విలన్‌గా అవార్డును అందజేశారు. భువనేశ్వర్‌లోని జయదేవ్ భవన్‌లో బుధవారం రాత్రి అంతర్జాతీయ చలన చిత్రోత్సవం నిర్వహించారు. 'ఎవడి సినిమాకు వాడే హీరో' సినిమాలో విలన్‌గా కుమార్‌నాయక్ ప్రతిభను ప్రదర్శించిన నేపథ్యంలో ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కంచలంక ఫిలిమ్ చానల్ ఈడీ చిత్తరంజన్ నాయక్, ఒడిశా ఫిలిమ్ డైరక్టర్ సుధాకర్‌బసంత్, హెచ్‌ఆర్ దిలీప్, జాతీయ ప్రధాన కార్యదర్శి రామచంద్రరెడ్డి, వివిధ భాషల నటులు పాల్గొన్నారు.


అవార్డు అందుకుంటున్న కుమార్‌నాయక్

వివిధ ప్రాంతాల్లో భారీ వర్షం



జమ్ము జంక్షన్ వద్ద సర్వీసు రోడ్డుపై చేరిన వర్షపునీరు, నందిగాంలో కురుస్తున్న వర్షం

నరసన్నపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ఒక మోస్తరు వర్షం కురిసింది. నరసన్నపేట పట్టణంలో పలు వీధుల్లో నీరు రోడ్డుపై ప్రవహించింది. భారీ వర్షాల వల్ల తుంపర భూముల్లో నీరు చేరింది. మెట్టు ప్రాంతా ల్లో వేసిన కూరగాయ పంటలు దెబ్బతిన్నాయి. సుందరాపురం, కంబకాయి, ఉర్లాం, చిక్కాలవలస, మామిడివలస, బాలసీమ వద్ద పంట పొలాల్లోకి నీరు చేరింది.

పిడుగుపాటుకు పాడైన విద్యుత్ ఉపకరణాలు

సంతబొమ్మాళి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సంతబొమ్మాళి దమ్మల వీధిలో గురువారం ఉదయం కొబ్బరిచెట్టుపై పిడుగుపడింది. దీంతో పలు ఇళ్లలో విద్యుత్ ఉపకరణాలు పాడయ్యాయి. పిడుగు శబ్దానికి వాదాల శ్రీరాములు ఇంట్లో ఉన్న విద్యుత్ ఉపకరణాలన్నీ నేల మట్టమయ్యాయి. మరో పది ఇళ్లలో టీవీలు, ఫ్రిజ్‌లు, ఇన్వెర్టర్లు పాడయ్యాయి. రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పాడయ్యాయి. వెంటనే స్పందించిన విద్యుత్ సిబ్బంది వేరు ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి విద్యుత్‌ను పునరుద్ధరించారు.

ఊరటనిచ్చిన వర్షం

నందిగాం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గురువారం పడిన మోస్తరు వర్షం పంటలకు ఊరటనిచ్చింది. గత 15రోజులుగా ఎండలతో మెట్టు ప్రాంత పంటలకు నీరు లేక రైతులు ఆందోళన చెందారు. అయితే గురువారం ఉదయం నుంచి పడిన జల్లులు పంటలకు ఊపిరి పోసాయని రైతులు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా రోజంతా ముసురుతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మందస, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 11 కేవీ మఖరజోల ఫీడర్ పరిధిలో శుక్రవారం విద్యుత్ నిలుపుదల చేస్తున్నట్లు పలాస ట్రాన్స్‌కో ఈఈ జి.యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. మఖరజోల ఫీడర్, ఉద్దానం ఫీడర్ పరిధిలో కొత్తగా విద్యుత్ స్తంభాలు వేయడం, మొక్కల తొలగింపు చేపడుతున్నందున ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నల్ల బొడ్డులూరు, బహడాపల్లి, బిడిమి, మఖరజోల, సువర్ణపురం ప్రాంతాల్లో విద్యుత్ నిలుపుదల చేస్తున్నామన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

వజ్రపుకొత్తూరులో..

వజ్రపుకొత్తూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బెండి 11 కేవీ ఫీడర్ పరిధిలో శుక్రవారం లైన్ మరమ్మతులు, చెట్ల తొలగింపు చేపడుతున్నందున విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బెండి,నగరంపల్లి, మంచినీళపేట, బొడ్డపాడు,పెదబాడం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

నందిగాంలో..

నందిగాం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): నందిగాం సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని టెక్కలి ట్రాన్స్‌కో ఈఈ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. నందిగాం, పెంటూరుల్లో చెట్లకొమ్మల తొలగింపు, నిర్వహణ నేపథ్యంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

ఘనంగా తిరువీధి ఉత్సవం



జలుమూరు, అక్టోబరు 17: (ఆంధ్రజ్యోతి) దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగేశ్వర క్షేత్రంలో కొలువుదీరిన ముఖలింగేశ్వర స్వామికి గురువారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిం చారు. గౌరీ పౌర్ణమి పర్వదినం పురస్కరించుకొని గురువారం పార్వతీ పరమేశ్వరుల విగ్రహాలను పల్లకిలో వేంచేపు చేసి తిరువీధి ఉత్సవం చేపట్టారు. పలువురు భక్తులు దర్శించుకుని తరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి.ప్రభాకరరావు, అర్చకులు నారాయణమూర్తి, వెంకటాచలం, శ్రీకృష్ణ, శివ, అచ్యుత, భక్తులు పాల్గొన్నారు.

నేడు జడ్పీలో దివ్యాంగుల ప్రత్యేక గ్రీవెన్స్

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం.. శ్రీకాకుళంలోని జడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం గ్రీవెన్స్ కార్యక్రమం 'స్వాభిమాన్' నిర్వహించనున్నట్టు విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ కె.కవిత ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ నెల మూడవ శుక్రవారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు దివ్యాంగుల నుంచి వినతులు స్వీకరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రొఫెసర్ సాయిబాబా మృతి తీరని లోటు

టెక్కలి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా సంతాప సభను గురువారం స్థానిక ఎస్సీ బాలుర వసతిగృహంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయిబాబా అనేక పోరాటాలతో జైలు జీవితం అనుభవించారన్నారు. ప్రభుత్వాలు ఆయనపై అక్రమంగా అరెస్టులు చేశాయన్నారు. ఆయన మృతి పోరాటాలకు తీరని లోటన్నారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నేతలు కుప్పిలి కామేశ్వరరావు, కురమాన దాలయ్య, ప్రొఫెసర్ కసవయ్య, చిన్నవాడు, జర్జాన బాబూరావు, చంద్రశేఖర్, ఆట్ల రాహుల్, టి.సూర్యం పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

నందిగాం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): టెక్కలి, నందిగాం మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రకృతి వ్యవసాయంపై గురువారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జిలు లోకేష్, అశోక్ కుమార్ నేతృత్వంలో సీడీపీవో శోభారాణి, ఏసీడీపీవో లక్ష్మీబాయి కార్యకర్తలకు ప్రకృతి వ్యవసాయం, దానివల్ల కలుగు ప్రయోజనాలను వివరించారు. ఐసీఆర్‌పీలు గోవింద్, ఆది, చిన్నబాబు పాల్గొన్నారు.